దివ్యాంగుల పింఛన్‌ను రూ. 6 వేలకు పెంచాలి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇచ్చిన ప్రసాద్, తదితరులు

రాంనగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్‌ను రూ. 6 వేలకు పెంచాలని, బస్సులో ఉచిత ప్రయాణం కల్పించాలని, ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరుతూ మంత్రి శ్రీధర్‌బాబుకు దివ్యాంగుల సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ ఆధ్వర్యంలో దివ్యాంగులు గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల చట్టం 2016ను పటిష్టంగా అమలు చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో 5 శాతం దివ్యాంగులకు కేటాయించాలని కోరారు. తమ డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భారతి, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంపై ఉచిత అవగాహన తరగతులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ త్వరలో నిర్వహిస్తున్న గ్రూప్-1, 2 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు తెలంగాణ ఉద్యమం, చరిత్ర, సంస్కృతి, సాహిత్యంపై విషయ నిపుణులతో ఉచిత అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు కృష్ణప్రదీప్స్ 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ కృష్ణప్రదీప్ తెలిపారు. సెప్టెంబర్ 2, 3 తేదీల్లో చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెండు రోజులపాటు జరిగే తరగతులకు ప్రధాన వక్తలుగా ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం, టీఎస్‌పీఎస్సీ సిలబస్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ హరగోపాల్, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ గంటా చక్రపాణి, 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్, టీఎస్‌పీఎస్సీ సిలబస్ కమిటీ మెంబర్లు ప్రొఫెసర్లు అడపా సత్యనారాయణ, గణేష్, గ్రూప్-1 ఆఫీసర్, పోటీ పరీక్షల పుస్తక రచయిత డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొంటున్నారని పేర్కొన్నారు. అభ్యర్థులు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు 91335 17733లో సంప్రదించవచ్చన్నారు.

జేఎన్‌టీయూలో సెంట్రలైజ్డ్ స్పాట్ కౌన్సెలింగ్

- 8 అనుబంధ ఇంజనీరింగ్ కాలేజీలకు హైదరాబాద్‌లోనే నిర్వహణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకు అనుబంధంగా ఉన్న ఎనిమిది ఇంజనీరింగ్ కాలేజీల్లో కౌన్సెలింగ్ అనంతరం మిగిలిపోయిన సుమారు 800కు పైగా సీట్లను స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీకి రిజిస్ట్రార్ గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఏ కాలేజీలో సీట్లను ఆ కాలేజీలో కాకుండా అన్ని కాలేజీల్లో సీట్ల భర్తీకి హైదరాబాద్‌లోనే సెంట్రలైజ్డ్ కౌన్సెలింగ్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 30న జేఎన్‌టీయూ హైదరాబాద్, సుల్తాన్‌పూర్ కాలేజీల్లో మిగిలిన సీట్లకు, 31న మంథని, జగిత్యాల జేఎన్‌టీయూ కాలేజీల్లో సీట్లకు, 2న వనపర్తి, సిరిసిల్ల, పాలేరు, మహబూబాబాద్ జేఎన్‌టీయూ కాలేజీల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందని. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలతో ఆయా తేదీల్లో జేఎన్‌టీయూలోని అడ్మిషన్స్ విభాగంలో హాజరుకావచ్చని తెలిపారు. స్పాట్ ద్వారా అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే సెంట్రలైజ్డ్ స్పాట్ కౌన్సెలింగ్ వల్ల ఖమ్మం, మహబూబాబాద్, మంథని, వనపర్తి, సిరిసిల్ల ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హైదరాబాద్‌కు వెళ్లాల్సి రావడం ఇబ్బందికరంగా భావిస్తున్నారని కొన్ని కాలేజీల ప్రిన్సిపాళ్లు చెబుతున్నారు. ఇంతకు ముందు మంథని జేఎన్‌టీయూ కాలేజీలో సింగరేణి కోటా సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లుగానే వర్సిటీ అడ్మిషన్ విభాగం అధికారులు అనుబంధ కళాశాలలకు వచ్చి స్పాట్ ప్రక్రియను చేపడితే బాగుండేదంటున్నారు.

బీటెక్ అగ్రికల్చరల్, ఫుడ్ టెక్నాలజీ కోర్సులకు కౌన్సెలింగ్

రాజేంద్రనగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మిగిలిన సీట్ల కోసం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. బీటెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సులలో స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 2వ తేదీ ఉదయం 10.30 గంటలకు రాజేంద్రనగర్‌లోని ఎగ్జామినేషన్ సెంటర్‌లో హాజరు కావాలని రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ స్ట్రీమ్ కింద తెలంగాణ ఎప్‌సెట్-2024లో అర్హత సాధించిన లేదా ఇంటర్ లేదా, తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకావచ్చని తెలిపారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని ఆయన సూచించారు.

పండుగల నేపథ్యంలో 60 ప్రత్యేక రైళ్ల పొడిగింపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దసరా, దీపావళి, క్రిస్మస్, ఛాట్.. తదితర పండుగల సందర్భంగా రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణమధ్యరైల్వే పరిధిలో నడుస్తున్న 60 ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నట్లు సీపీఆర్‌ఓ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా సికింద్రాబాద్-రామనాథపురం, కాచిగూడ-మధురై, నాందేడ్-ఈరోడ్, కాచిగూడ-నాగర్‌సోల్, సికింద్రాబాద్-కొల్లాం, తిరుపతి-అకోలా, తిరుపతి-పూర్ణ, లింగంపల్లి-కాకినాడ టౌన్, తిరుపతి-సికింద్రాబాద్, కాచిగూడ-తిరుపతి, సికింద్రాబాద్-నాగర్‌సోల్, తిరుపతి-మచిలీపట్నం, సికింద్రాబాద్-అగర్తల, హైదరాబాద్-జైపూర్, హైదరాబాద్-జాల్నా, కాచిగూడ-లైగా, కాచిగూడ-హిస్సార్, హైదరాబాద్-గోరఖ్‌పూర్, తిరుపతి-షిరిడి సాయినగర్, హైదరాబాద్-రెక్సాల్, సికింద్రాబాద్-ధనపూర్, సికింద్రాబాద్-సత్రగచ్చి, షాలిమార్-నిజాముద్దీన్, సికింద్రాబాద్-నిజాముద్దీన్ మార్గాల్లో నడుస్తాయని పేర్కొన్నారు. ప్రత్యేకరైళ్లు అక్టోబర్ 2 నుంచి జనవరి 3వ తేదీ వరకు కొనసాగుతాయని వెల్లడించారు.

సరిపోదా శనివారం సినిమాను వీక్షించిన హీరో నాని

చిక్కడపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని సుదర్శన్ 35 ఎంఎం థియేటర్‌లో గురువారం విడుదలైన సరిపోదా శనివారం సినిమాను మార్నింగ్ షోలో ఆ సినిమా బృందం ప్రేక్షకులతో కలిసి వీక్షించారు. హీరో నానితో పాటు హీరోయిన్ ప్రియాంకమోహన్, పంపిణీదారు శిరీష్‌రెడ్డి వీక్షించారు. థియేటర్ మేనేజింగ్ పార్ట్‌నర్ బాల్‌గోవింద్‌రాజ్, మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, దేవి థియేటర్ మేనేజర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

కవాడిగూడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న మెట్రోస్టేషన్ వద్ద 75 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు గాంధీనగర్ సీఐ రాజు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.

అనారోగ్యంతో చిక్కడపల్లి హెడ్‌కానిస్టేబుల్..

చిక్కడపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్(50) గురువారం మధ్యాహ్నం మృతిచెందారు. కొంతకాలంగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఇన్‌స్పెక్టర్ సీతయ్య, సిబ్బంది రెహమత్‌నగర్‌లోని భాస్కర్ నివాసానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి..

కవాడిగూడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో నష్టం రావడం వల్ల ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కవాడిగూడ మసీద్ గల్లీలో నివాసం ఉండే ఎస్.చంద్రశేఖర్(39)కు శ్రీప్రియతో మూడేళ్ల కిందట వివాహమైంది. కొత్త బజార్ మెయిన్ రోడ్డులో ఉన్న కవాడి కేఫ్ హోటల్‌ను లీజుకు తీసుకున్నాడు. మూడు నెలల క్రితం హోటల్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగి సిలిండర్ పేలి నష్టం వాటిల్లింది. దీంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న చంద్రశేఖర్ అమ్మవారి దీక్షలో ఉన్న కండువాతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాంధీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

మణెమ్మ గల్లీలో రోడ్డు ఆక్రమణలపై విచారణ



మణెమ్మ గల్లీలో రోడ్డు కొలతలు తీసుకుంటున్న టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, సిబ్బంది

రాంనగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో రాంనగర్‌లోని మణెమ్మ గల్లీలో రోడ్డు ఆక్రమణలపై జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం విచారణ ప్రారంభించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం మణెమ్మ గల్లీలో రోడ్డు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ఉంది, వెడల్పు ఎంత, ప్రస్తుతం ఉన్న రోడ్డు ఎంత, రోడ్డుకు ఇరువైపులా ఎవరైనా స్థలాన్ని ఆక్రమించారా అనే అంశాలపై రెవెన్యూ అధికారులతో కలిసి జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ అందరి ఇంటి యజమానుల డాక్యుమెంట్లను పరిశీలించారు. ఈ గల్లీలో వరదనీటి కాల్వ సమస్య పరిష్కారానికి అధికారులు మ్యాప్ తయారు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ దేవేందర్ మాట్లాడుతూ బస్తీలో రోడ్డు కొలతలు తీసుకున్నామని, నివేదికను కమిషనర్‌కు సమర్పిస్తామని, ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో బస్తీవాసులు సతీష్, మనీష, నాగేంద్ర శ్రీనివాస్, నేతి రాజేశ్వర్, బాబుయాదవ్, సంధ్యారాణి, జీహెచ్‌ఎంసీ సెక్షన్ ఆఫీసర్ హఫీజ్, సిబ్బంది జగన్, రెవెన్యూ సిబ్బంది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

హనుమంతుగౌడ్ మృతి బీఆర్‌ఎస్‌కు తీరని లోటు

- ఎమ్మెల్యే ముఠా గోపాల్



హనుమంతుగౌడ్ చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్, తదితరులు

ముషీరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ బీసీ సెల్ కార్యదర్శి హనుమంతుగౌడ్ పార్టీకి అందించిన సేవలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను మరువలేమని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్‌లోని ఎస్‌బీఐ కాలనీలో బీఆర్‌ఎస్ నాయకుడు హనుమంతు గౌడ్ సంతాపసభ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హనుమంతుగౌడ్ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తూ అందరివాడిగా ఎదిగారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, సీనియర్ నాయకుడు డి.శివముదిరాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు నందమూరి హరికృష్ణ



నందమూరి హరికృష్ణ చిత్రపటానికి నివాళులర్పించిన సాయిబాబా తదితరులు

రాంనగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్టీఆర్ చైతన్యరథానికి సారథిగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన మహనీయుడు, మాజీ మంత్రి నందమూరి హరికృష్ణ అని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా కొనియాడారు. గురువారం టీడీపీ నగర కార్యాలయంలో నందమూరి హరికృష్ణ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని దీటుగా ఎదుర్కొన్న ఏకైక వ్యక్తి హరికృష్ణ అని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్ గౌడ్, నాయకులు ఎస్. ప్రకాష్, పెద్దోజు రవీంద్రాచారి, జి.యాదగిరిరావు, మేడిపల్లి శ్యామ్‌సుందర్, రాజు, చంద్రమోహన్, వెంకటేష్‌చౌదరి, భానుప్రకాష్, కిరణ్, సత్యనారాయణ, భవానీశ్రీనివాస్, వై.ఎల్.నర్సింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాగ్‌అంబర్‌పేట సమస్యల పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి



తిలక్‌నగర్ చౌరస్తా వద్ద డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి

నల్లకుంట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి అన్నారు. తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్లు, రోడ్డు నిర్మాణం, పార్కుల అభివృద్ధి కార్యక్రమాల అమలులో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. గురువారం డివిజన్‌లో కార్పొరేటర్ పాదయాత్ర చేశారు. తిలక్‌నగర్ చౌరస్తా వద్ద జీహెచ్‌ఎంసీ అధికారులు సిబ్బందితో డ్రైనేజీ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు జమ్మిచెట్టి బాల్‌రాజ్, కె.శ్రీహరి, చంద్రశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యాసదస్సు : ట్రస్మా



సమావేశంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు పాపిరెడ్డి తదితరులు

కవాడిగూడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా విధానం, ప్రైవేట్ పాఠశాలల సమస్యలపై ఈ నెల 31న విద్యా సదస్సును నాగోల్‌లోని శుభం గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.రెడ్డి తెలిపారు. గురువారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సదస్సుకు అన్ని జిల్లాల ట్రస్మా కరస్పాండెంట్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు. రాజకీయాలకతీతంగా ఈ సదస్సుకు కేంద్రమంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్సీలు కోదండరాం, ఏవీఎన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ట్రస్మా నాయకులు కడారు అనంతరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చింతల రాంచందర్, శ్రీపతి శేఖర్‌రెడ్డి, అరుకాల రామచంద్రారెడ్డి, అనిల్‌కుమార్, మారం లింగారెడ్డి, బాణాల రాఘవ, జి.నారాయణరెడ్డి, భరత్‌కుమార్, జలంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ప్రగతిపథం వైపు పయనించాలి: వక్తలు



దుస్తులను పంపిణీ చేసిన కార్పొరేటర్లు యాకర అమృత, కన్నె ఉమాదేవి, మధుసూదన్‌యాదవ్ తదితరులు

నల్లకుంట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మహిళలు ప్రగతిపథం వైపు పయనించాలని వక్తలు సూచించారు. స్ఫూర్తి భవన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇస్తూ వారు తయారు చేసిన దుస్తులను పేద విద్యార్థినులు, జీహెచ్‌ఎంసీ పారిశుధ్య సిబ్బందికి ఉచితంగా అందజేయడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. గురువారం నల్లకుంట డివిజన్ పాత రామాలయం వీధిలోని స్ఫూర్తి భవన్ కార్యాలయంలో వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్యం సాధించిన వారికి సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన మహిళలు తయారు చేసిన బ్లౌజ్, ఫ్రాక్స్ ఇతరత్రా దుస్తులను స్థానిక పేద విద్యార్థినులు, జీహెచ్‌ఎంసీ పారిశుధ్య సిబ్బందికి ఉచితంగా పంపిణీ చేశారు. స్ఫూర్తి భవన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.మధుసూదన్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఐస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సీఈవో హరీష్‌రంగాచౌదరి, నల్లకుంట, కాచిగూడ కార్పొరేటర్లు యాకర అమృత, కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ నిర్వాహకురాలు శిరీష, ప్రతినిధి స్వప్న, నాయకులు భాస్కర్, రాజ్‌గోపాల్, శ్రీనివాస్, మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి: అడిషనల్ డీసీపీ



విజేతలకు కప్ అందజేస్తున్న ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య

బర్కత్‌పుర, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య సూచించారు. క్రీడల వల్ల శారీరక వ్యాయామం, మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, విజయం సాధించాలనే పట్టుదల కూడా పెరుగుతుందని ఆయన అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ విజ్ఞానం అత్యుత్తమ శక్తివంతమైన ఆయుధం అని, దాని ద్వారా ఉన్నతస్థాయికి విద్యార్థులు ఎదగవచ్చని అన్నారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి, సీనియర్ అధ్యాపకులు ప్రసాదరావు, గీతాబాయి, రామ్మోహన్, అనిల్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన రాగరాగిణి గీత కదంబం



గాయనీగాయకులను అభినందిస్తున్న వంశీ రామరాజు, రమణకుమారి

చిక్కడపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాగరాగిణి సాంస్కృతిక సేవా సంస్థ నిర్వాహకులు రమణకుమారి, సుబ్బలక్ష్మి సోదరీమణులు సాంస్కృతికరంగంలో ప్రత్యేక గుర్తింపు కలవారని వంశీ సంస్థల అధినేత డా.వంశీ రామరాజు అన్నారు. వారు ఉత్తమ కార్యక్రమాలను సమర్థతతో నిర్వహిస్తారని తెలిపారు. త్యాగరాయ గానసభలో గురువారం రాత్రి రాగరాగిణి సాహితీ సేవాసంస్థ సినీ గీత కదంబం కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ గాయని రమణకుమారి, సహ గాయకులు శశిరేఖమల్లాది, మల్లాది ఉష, సుబ్రహ్మణ్యం, దినకర్‌రావు, కమలాకరరావు, ప్రభుకుమార్, రామకుమార్‌తో కలిసి నాటి ఘంటసాల సుశీల జానకి సినిమాలో పాడిన పాటలతో పాటు నేటి బాలు చిత్రంలో పాడిన పాటలు సుమధురంగా ఆలపించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వంశీ రామరాజు మాట్లాడుతూ నాటి సుశీల పాటలు రమణకుమారి హృద్యంగా పాడగలరని అభినందించారు. సంస్థ కార్యదర్శి సుబ్బలక్ష్మి నివేదిక సమర్పించారు.

మీపైన 15 కేసులు.. చెప్పింది వినకపోతే అరెస్టే

- మనీ ల్యాండరింగ్ కేసుల పేరుతో బెదిరించి వృద్ధురాలి ఖాతా ఖాళీ చేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మనీ ల్యాండరింగ్ కేసులు, వేధింపుల కేసుల పేరు చెప్పి వృద్ధురాలిని బెదిరించిన సైబర్ నేరగాళ్లు ఆమె ఖాతా ఖాళీ చేశారు. నగరానికి చెందిన వృద్ధురాలు(85)కు గుర్తు తెలియని నంబర్ నుంచి ఓ మహిళ ఫోన్ చేసింది. తాను టెలికాం శాఖ నుంచి ఫోన్ చేస్తున్నానని చెప్పింది. మీ ఫోన్ నంబర్ వినియోగించి వేధింపులు, అసత్య ప్రచారం జరిగాయని, త్వరలోనే మీ నంబర్ బ్లాక్ అవుతుందని హెచ్చరించింది. ఇలా జరగకుండా ఉండాలంటే ఢిల్లీ పోలీసులను సంప్రదించమంటూ, వేరే వ్యక్తిని వీడియోకాల్ ద్వారా లైన్‌లో తీసుకుంది. ఢిల్లీ దరియాగంజ్ పోలీస్‌స్టేషన్ అధికారిగా పరిచయం చేసుకున్న అతడు.. మీపై ఢిల్లీ కోర్టులో 15 కేసులు నమోదయ్యాయని చెప్పాడు. అంతేగాకుండా మీ బ్యాంక్ ఖాతాల నుంచి విదేశాలకు కోట్ల కొద్దీ డబ్బు వెళ్లిందని, దీనిపై సీబీఐ అధికారులకు వివరణ ఇవ్వండి అంటూ మరో వ్యక్తికి ఫోన్ కలిపాడు. సీబీఐ అధికారిగా పరిచయం చేసుకున్న అతడు మీపై మనీలాండరింగ్ కేసు నమోదైందని, మీ ఖాతాలు తనిఖీ చేయాలని దానికి సంబంధించి కోర్టు ఆర్డర్ ఉందంటూ కాపీ చూపాడు. ఫిక్స్‌డ్ డిపాజిట్లతోపాటు ఖాతాలో ఉన్న డబ్బు మొత్తం తాము సూచించిన ఆర్‌బీఐ ఖాతాకు మళ్లించాలని చెప్పాడు. వీడియో కాల్ ఆపవద్దని, కెమెరా ముందే ఉండాలని చెప్పాడు. ఈ విషయం ఎవరితోనైనా చర్చించినా వెంటనే అరెస్ట్ చేస్తామని బెదిరించాడు. అలా వృద్ధురాలిని భయపెట్టి గృహనిర్బంధం చేసి, ఆమె ఖాతాలో ఉన్న రూ. 8.75 లక్షలు కాజేశారు. మోసపోయానని గ్రహించిన వృద్ధురాలు స్నేహితుడి సాయంతో సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

● చెట్లకొమ్మల తొలగింపు



రాంనగర్ డివిజన్ హరినగర్‌లో చెట్లకొమ్మలు ఇంటిపై పడి పురుగులు వస్తున్నాయని స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ కె.రవిచారి ఆ ప్రాంతాన్ని గురువారం సందర్శించారు. వెంటనే జీహెచ్‌ఎంసీ హార్టికల్చర్ సిబ్బందిని రప్పించి చెట్లకొమ్మలను తొలగించారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి

పఠాన్‌బస్తీలో కలుషితనీటి నివారణకు చర్యలు



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న మోహన్‌రాజ్, సురేష్ తదితరులు

ముషీరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ పఠాన్‌బస్తీలో నెల రోజులుగా కలుషితనీటి సరఫరా వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఫర్వేజ్ జలమండలి డీజీఎం మోహన్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు గురువారం ఆధునిక టెక్నాలజీతో సమస్యను గుర్తించారు. ఫరాజ్ మియా మజీద్ వద్ద పాత పైపులైన్ తొలగించారు. నూతన పైపులైన్ వేశారు. ఈ సందర్భంగా డీజీఎం మోహన్‌రాజ్ మాట్లాడుతూ పటాన్‌బస్తీలో కలుషితనీటి సరఫరా సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జలమండలి సెక్షన్ మేనేజర్ సురేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



మట్టి, చెత్తకుప్పలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మట్టి, చెత్తకుప్పల తొలగింపు

చిక్కడపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్ సుదర్శన్ 35 ఎంఎం థియేటర్ పక్కనున్న వీధిలో పేరుకుపోయిన మట్టి, చెత్తకుప్పలను మున్సిపల్ సిబ్బంది గురువారం తొలగించారు. ఈ సమస్యపై స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయగా, పారిశుధ్య విభాగం సిబ్బందితో మట్టి, చెత్తకుప్పల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు.

మొదలైన కచ్చానాలా పైపులైన్ పనులు

చిక్కడపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని జవహర్‌నగర్‌లో కచ్చానాలా పనులను గురువారం ప్రారంభించారు. మున్సిపల్ డీఈ గీత, ఏఇ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్ తదితరులు పనును పరిశీలించారు. డీఈ గీత మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తిచేసి వరదనీటి ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు వినయ్, సాయికుమార్, ఆనంద్‌రావు, అరుణ్‌కుమార్, దినేష్ పాల్గొన్నారు.



ఎక్సైజ్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దామోదర్‌గౌడ్

రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఎక్సైజ్ పాలసీని ప్రకటించాలి

బర్కత్‌పుర, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అక్టోబర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఎక్సైజ్ పాలసీని ప్రకటించాలని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఎక్సైజ్ పాలసీ అస్తవ్యస్తంగా ఉందని ఆరోపించారు. గురువారం నాంపల్లిలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. వైన్‌షాపుల వద్ద నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పర్మిట్ రూమ్‌ను తక్షణమే మూసేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్, ప్రతినిధులు రామకృష్ణరాజుగౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కళాశాల స్థాయిల్లో ఎన్‌ఎస్‌యూఐ కమిటీలు

హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కళాశాల స్థాయిలోని విద్యార్థి ప్రతినిధులతో ఎన్‌ఎస్‌యూఐ యూనిట్‌లను ఏర్పాటు చేసి, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ రూపొందించనున్నట్లు ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి తెలిపారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కమిటీ సమావేశంలో డ్రగ్స్ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఎన్‌ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శులు మహ్మద్ ఫాహద్, ప్రతీక్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోని బీజేపీ అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను ఎండగడుతూ పోరాటాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అండగా ఉండాలని సూచించారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

కవాడిగూడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా మండప నిర్వాహకులు తమ వంతు సహకారం అందించాలని గాంధీనగర్ సీఐ రాజు గణేష్ సూచించారు. అనుమతి లేకుండా మండపాలను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గురువారం సాయంత్రం గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎస్ఐలు నాగరాజురెడ్డి, నయీమ్‌ఖాన్, హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ముషీరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్(డీసీపీయూ) లీగల్ ఆఫీసర్ రఫియా సూచించారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్ సిద్ధిక్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఎస్‌ఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వం పిల్లలకు, మహిళలకు అందించే పథకాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌డీ ప్రతినిధులు శివరాణి, ఇందిరాభారతి, వెంకటేశ్వరి, జబీన్ పాల్గొన్నారు.